క్లుప్తంగా

'మనఊరు-మనబడి' పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోటపల్లి: మండలంలో 'మనఊరు-మనబడి' పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి సూచించారు. సిర్సా, ఎదులబంధం గ్రామాల్లో కొనసాగుతున్న 'మనఊరు-మనబడి', కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించినా, నాణ్యత లోపించినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఎదులబంధంలోని కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి సిబ్బంది వివరాలు, పరీక్షలు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో భాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్, కార్యదర్శి సమ్మయ్య, సదయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బస్ పాస్ ఉన్న విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని పల్లెవెలుగుతో పాటు లగ్జరీ బస్సులో ప్రయాణించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బోనమో.. పోచమ్మా..!



బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి రైల్వేస్టేషన్ ఏరియా పెద్దనపల్లి బస్తీలో మంగళవారం పోచమ్మ తల్లికి భక్తులు భక్తి ప్రపత్తులతో బోనం సమర్పించారు. గ్రామదేవతలైన పోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత గ్రామశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామ దేవతలకు బోనం సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. బస్తీ వాసులు, మహిళలు చిన్నాచితక తారతమ్య బేధం లేకుండా, వేలాది మంది బోనాలతో పురవీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. భక్తి పారవశ్యంతో పూజలు చేసి గ్రామ దేవతలకు బోనం సమర్పించుకున్నారు. సల్లంగా చూడాలని గ్రామదేవతలను వేడుకున్నారు. డప్పుసప్పులు, నృత్యాలు బోనాల సమర్పణ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

చెన్నూర్: ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు విద్యాశాఖ అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు కుర్చీలు, బెంచీలతో పాటు తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వేసవి కాలం కావడంతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి తిరుపతి, నాయకులు రంజిత్, రమేశ్, అంజి, రవీందర్, మహేందర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఎదురుగా వస్తున్న కారును ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు, ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మంచిర్యాల నుంచి సీసీసీ కార్నర్ వెళ్తున్న ట్రాక్టర్, ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో ట్రాక్టర్ అదుపు తప్పి ఫ్లై ఓవర్ బ్రిడ్జి రేలింగ్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్లోని ఇసుక రోడ్డుపై అడ్డంగా పడడంతో రహదారి గుండా వెళ్తున్న వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులను వివరణ కోరగా హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ మంచిర్యాలకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బడి మెరిసే.. విద్యార్థులు మురిసే



- 'మనఊరు-మనబడి'తో కార్పొరేట్ హంగులు
- సంబురపడుతున్న విద్యార్థులు

దండేపల్లి: గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం 'మనఊరు-మనబడి' కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. దండేపల్లి మండలంలో 68పాఠశాలలకుగాను 19పాఠశాలలను 'మనఊరు-మనబడి'లో ఎంపిక చేశారు. అందులో పెద్దపేట, మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. వీటిలో పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తికాగా, కార్పొరేట్ హంగులతో మెరిస్తోంది. పాఠశాలకు 'మనఊరు- మనబడి' పథకం ద్వారా రూ.12లక్షలు కేటాయించి విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు, ప్రతి తరగతి గదిలో విద్యుత్ ఆధునీకీకరణ పనులు చేపట్టి లైట్లు, నాలుగు ఫ్యాన్లు బిగించారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించి, హ్యాండ్ వాష్ బేషన్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల పై కప్పులకు మరమ్మతు చేయడంతో పాటు, పాఠశాల మొత్తానికి రంగులు వేశారు. ఇవే కాకుండా రూ.12లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, బాల బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మించారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగితా పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగా పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చాలా బాగుంది..



మా బడిలో మంచి సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు బడి చాలా బాగుంది. కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఫ్యాన్లు బిగించారు. ఆటలాడుకునేందుకు పాఠశాల గ్రౌండ్‌ను బాగు చేశారు. టాయిలెట్లు కొత్తవి కట్టారు. హ్యాండ్ వాష్ కోసం నల్లాలు ఏర్పాటు చేశారు. బడి మెరిసి పోయేలా రంగులు వేశారు.

– స్విగ్ర, విద్యార్థిని, 5వ తరగతి

అన్ని సౌకర్యాలు కల్పించారు..



పిల్లలు బాగా చదువుతున్నారు. 'మనఊరు -మనబడి'తో పాఠశాలలో పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పించారు. టీచర్లు కూడా పిల్లలపై శ్రద్ధ చూపడంతో పాటు, ప్రైవేటు బడి కంటే మంచిగా చదువు చెపుతున్నారు. దీంతో పిల్లలందరినీ ఇక్కడికే పంపిస్తున్నాం.

– అంజయ్య, పేరెంట్

నమ్మకం మరింత పెరిగింది..



గతంలో సరైన వసతులు లేక కొంత ఇబ్బందిగా ఉండేది. 'మనఊరు-మనబడి' పథకంలో మా పాఠశాలను ఎంపిక చేశారు. పాఠశాలలో అన్ని రకాల వసతులు మెరుగు పరిచారు. దీంతో విద్యార్థులతో పాటు, పనిచేసే సిబ్బందికి ఇబ్బంది లేకుండా అయ్యింది. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం, దానికి తోడు మేం అందించే బోధనతో పిల్లల తల్లిదండ్రుల్లో నమ్మకం మరింత పెరిగింది.

– శ్రీలత, పాఠశాల హెచ్ఎం

ఎస్సీ వర్గీకరణకు మాదిగల సంగ్రామ యాత్ర



యాత్రలో పాల్గొన్న నాయకులు

మందమర్రిరూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. స్థానిక సింగరేణి హైస్కూల్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీవర్గీకరణ విషయంలో నాన్చుడు దోరణి వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు జీడి సారంగం, ఇరిగిరాల అరుణ్, ఉదయ్‌కుమార్, సుగుణాకర్, సుభాష్, విష్ణు, కిరణ్ తదితరులు ఉన్నారు.

రామకృష్ణాపూర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్దత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మాదిగల సంగ్రామయాత్ర మంగళవారం రామకృష్ణాపూర్‌కు చేరింది. సంగ్రామ యాత్రలో భాగంగా ఏప్రిల్ 4న తలపెట్టిన హైదరాబాద్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ సమ్మయ్య, సురేష్, సారంగం, సంపత్, సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వివాదాస్పదంగా మధ్యాహ్న భోజనం నిర్వహణ'

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణ వివాదాస్పదంగా మారుతోంది. మెనూ పాటించటం లేదని వంట ఏజెన్సీ తొలగించి కొత్తగా మరో ఏజెన్సీని విద్యాశాఖ నియమించింది. పాత ఏజెన్సీ నిర్వాహకురాలు మాత్రం పాఠశాలకు రాకుండా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు పాఠశాలకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్‌కు కోడిగుడ్డు పెట్టడం లేదని తెలియటంతో అడిషనల్ కలెక్టర్ రాహుల్ (లోకల్‌బాడీ) దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు పరిశీలనకు వెళ్లగా, కోడిగుడ్డు కాకుండా మెనూ ప్రకారం భోజనం అందించటం లేదని తేలింది. ఈ విషయంపై ఎస్ఎంసీ, పేరెంట్స్ సమావేశం పెట్టి ఏజెన్సీ తీరుపై తీర్మానం చేసి విద్యాశాఖకు పంపారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం విచారణ అనంతరం పాత ఏజెన్సీ నిర్వాహకురాలిని తొలగించారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశానుసారం మండలస్థాయిలో ఎంఈవో, తహసీల్దార్‌లు వంట ఏజెన్సీ నిర్వాహకురాలిగా వెంకటలక్ష్మిని నియమిస్తూ ఈ నెల 4న ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 9న పాఠశాలకు వచ్చి మధ్యాహ్న వంట చేయాలని సమాచారమిచ్చారు. ప్రొసీడింగ్‌తో పాఠశాలకు వెళ్లిన ఆమెను ఇదివరకు తొలగించిన ఏజెన్సీ నిర్వాహకురాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నట్లు తెలిసింది. చేసేది ఏమిలేక కొత్తగా నియమితులైన కుక్‌కమ్ హెల్పర్ జరిగిన విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ సమస్య పరిష్కారంలో జాప్యం నెలకొంది.

ప్రభుత్వ భూమి స్వాధీనం



ఆక్రమణలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమిలో వెలసిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు మంగళవారం జేసీబీ సాయంతో తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ మాంతయ్య కథనం ప్రకారం.. సీతారాంపల్లి శివారు సర్వే నంబరు 22లో రాచమడుగు రంగారావుకు 1987లో ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కాగా చిలగాని పద్మ భర్త బొడ్డయ్య అనే వ్యక్తి 2004లో ఒక ఎకరం 20గుంటలు రంగారావు దగ్గర కొనుగోలు చేశారన్నారు. మీరు నిబంధనలకు విరుద్ధంగా భూమిని కొనుగోలు చేశారని చిలగాని పద్మకు తాము నోటీసులు పంపగా, ఆమె హై కోర్టును సంప్రదించిందని తెలిపారు. హై కోర్టు వారు మంచిర్యాల ఆర్డీఓకు విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. విచారణ జరిపిన ఆర్డీఓ ఆ భూమిని నిబంధనలకు విరుద్ధంగా పద్మ కొన్నారని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోర్టుకు నివేదిక సమర్పించారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ భూమిలో వెలసిన అక్రమకట్టడాలను తొలగించి, భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సర్వేయర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

బెల్లంపల్లి: మహిళలు అన్నిరంగాల్లో రాణించడానికి ముందుకు రావాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సతీమణి జయతార, సఖీ ఎన్జీవో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శైలజ సూచించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను మంగళవారం బెల్లంపల్లిలో అట్టహాసంగా ముగిశాయి. వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి మహిళల్లో చైతన్యం కలిగించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రతి మహిళా చట్టాలు, హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. పురుషులతో సమానంగా ఎదగడానికి మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ఎమ్మెల్యే సతీమణి జయతార, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత బహుమతులు అందజేశారు.

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ నుంచి మహిళా సిబ్బందికి ఆటలపోటీలు నిర్వహించగా విజేతలకు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మంగళవారం బహుమతులు అందించారు. పలువురు మహిళా సిబ్బందిని ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు.

కార్ల్‌మార్క్స్‌కు నివాళి

పాతమంచిర్యాల: పెట్టుబడి దారి సమాజానికి వ్యతిరేఖంగా పోరాటం చేసిన జర్మన్ శాస్త్రవేత్త, ఆర్థికవేత్త, సామాజిక వేత్త, సోషలిస్టు విప్లవకారుడు కార్ల్‌మార్క్స్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కామ్రేడ్ అనభేరి ప్రభాకర్‌రావు వర్ధంతి

పాతమంచిర్యాల: తెలంగాణ కమ్యూనిస్టు నాయకుడు అనభేరి ప్రభాకర్‌రావు వర్ధంతిని జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ నాయకులు, ఎల్లాపి కుల సంక్షేమ సంఘం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్ఎంపీ ప్రకారం పని చేయాలి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి సేఫ్టీ మేనేజ్మెంట్ ప్రొసీజర్స్ ప్రకారం పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద మంగళవారం రక్షణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి రక్షణతో పని చేయాలని సూచించారు. ప్రమాదరహిత సంస్థగా కంపెనీని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజయన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, డీజీఎంలు శివరావు(సివిల్), చిరంజీవులు(ఐఈడీ), రామనాథం(ఈఅండ్ఎం), సేఫ్టీ కమిటీ కన్వీనర్ కే వెంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బి రాము, డీవైఎస్ఈ రాము పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

శ్రీరాంపూర్: వీటీసీలో శిక్షణ పొందుతున్న యువ ఉద్యోగులు మంగళవారం ఆర్కే 8 డిస్పెన్సరీలో రక్తదానం చేయగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తనిధిని సేకరించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎంవీటీసీ మేనేజర్ వెంకటర రామారావు, డీవైసీఎంఓ రమేశ్‌బాబు, డీజీఎం(సివిల్) శివరావు, హెల్త్‌ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంవీటీసీ శిక్షకులు రాజ్‌కుమార్, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల అసోసియేషన్ నుంచి కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

మెడికల్ కార్డు తీసుకోవాలి

శ్రీరాంపూర్: పదో వేజ్‌బోర్డు పరిధిలో రిటైర్డ్ అయిన వారు ఇంకా మెడికల్ కార్డు తీసుకోకుంటే దరఖాస్తు చేసుకోవాలని జీఎం(పర్సనల్) బసవయ్య తెలిపారు. డీజీఎం(పర్సనల్) అరవిందరావుతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రిటైర్డ్ అయిన, అన్‌ఫిట్ అయిన వారు సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు క్రింద మార్చి 31లోగా సంబంధిత ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు రాజేశ్వర్‌రావు, కాంతారావు, పాలకుర్తి రాజు, సునీల్, రణదీప్‌గౌడ్, పాషా, మోహన్‌సింగ్, శంకర్, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత హోదాలో ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పరికరాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, పీఈటీ బండ జీవరత్నం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శ్రీరాంపూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్‌లోని చైర్మన్ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మహిళలు ఎదగడానికి ప్రభుత్వం అన్నిరకాల సహాయసహకారాలు అందిస్తుందన్నారు. మహిళల కోసం అనేక స్కీంలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకొని ఎదగాలన్నారు. పావలా వడ్డీ రుణాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్, బతుకమ్మ చీరలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను మహిళల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన పలు క్రీడాపోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, కౌన్సిలర్లు పంబాల గంగ, బండి పద్మ, పూదరి కుమార్, మెప్మా టీఎంసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ కో–ఆపరేటివ్ బ్యాంకు సమావేశం



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ వినయ్‌కుమార్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 43వ సర్వసభ్య సమావేశం మంగళవారం బ్యాంక్ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకు గత 30–09–2022 ముగిసిన అర్థ సంవత్సరానికి రూపాయలు 31.46లక్షలు లాభం ఆర్జించిదని, మంచిర్యాల సీ,సీ,సీ బ్రాంచ్‌లో ఏటీఎంలు ప్రారంభించి, ఏటీఎం కార్డులు కూడా ఖాతాదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. బ్యాంక్ ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. బ్యాంకు నుంచి చిన్న వ్యాపారుల అభివృద్ధికి గాను లోన్లు ఇస్తున్నట్లు, బ్యాంకు నుంచి క్యూఆర్ కోడ్ స్కాన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు 30–09–2022 అర్ధ సంవత్సరం ఆస్తి అప్పుల పట్టిక, లాభనష్టాల ఖాతాను (ఆడిట్ కానిది) ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్, బ్యాంక్ డైరెక్టర్లు, వాటాదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

భీమిని/కాసిపేట/బెల్లంపల్లి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. భీమిని మండలంలోని వెంకటాపూర్ నుంచి సుర్జాపూర్ వరకు సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. కాసిపేట మండలంలోని సండ్రల్‌పాడ్, దుబ్బగూడం, బుగ్గగూడం, వరిపేట గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యకర్తలు, ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన ప్రోత్సాహక బహుమతి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, కన్నెపల్లి జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, వెంకటాపూర్ సర్పంచ్ వెంకన్న, చిన్నతిమ్మాపూర్ సర్పంచ్ భూమేష్, కాసిపేట ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, బెల్లంపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, హెచ్‌డబ్ల్యూవో సరిత తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసేదెవరు..?

- భూమి ఇప్పించాలంటూ వేడుకోలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇరికిల్ల భీమక్క

నస్పూర్: నిరుపేద దళిత మహిళనైన నాకు న్యాయం చేసేది ఎవరూ అంటూ నస్పూర్‌లోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఇరికిల్ల భీమక్క తన ఆవేదనను వెలిబుచ్చారు. న్యాయం చేయాలంటూ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్–ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి తన ఆవేదనను విలేకరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నస్పూర్ శివారు 64సర్వే నంబరులో ప్రభుత్వం 1994లో రెండు గుంటల భూమిని అసైన్డ్ చేసినట్లు తెలిపారు. ఆ భూమి చదును చేసుకుందామని వెళ్లగా, ఎండీ ఖలీద్ అనే వ్యక్తి ఈ భూమి నాది అని, ఇక్కడ నీకు ఎలాంటి భూమి లేదని పోలీసులను పిలిపించి బెదిరించినట్లు ఆమె ఆరోపించారు. కొద్దిరోజుల క్రితం పోలీసులకు, ఎమ్మెల్యే దివాకర్‌రావుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్‌ను కలవమని ఎమ్మెల్యే సూచించగా సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లానని తహసీల్దార్ జ్యోతి సమస్య వినకుండా నన్ను బయటకు పంపించారని వాపోయారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిరుపేద దళిత మహిళనైన నాకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొప్పర్తి లక్ష్మి, గొడిసెల లక్ష్మి, రాజమ్మ, శాంత, భీమక్క తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఏప్రిల్ 3, 4తేదీల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ రవీందర్, బీసీ ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

18న వేంపల్లి మేకల సంత వేలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లిలో మేకల సంతను 18న (శనివారం) ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ వోలపు శారద, కార్యదర్శి సత్తు ప్రతిభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

18న దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

శ్రీరాంపూర్: నస్పూర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన పలు ఆలయాల్లో ఈ నెల 18న దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పద్మశాలి కుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మశాలి సంఘం ఏరియా అధ్యక్షుడు దేవసాని నాగరాజు, ప్రధాన కార్యదర్శి చిలువేరు సదానందం, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిప్ప రాజబాబు మాట్లాడారు. 16వ తేదీ నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: ఈ నెల 15న మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేసేందుకు మంత్రి హరీష్‌రావు హాజరవుతున్నందునా సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య కోరారు.

పార్‌పల్లిలో వైద్య శిబిరం

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో సబ్ సెంటర్ పార్‌పల్లి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీబీ రోగులకు, జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899